# సంపాదకీయము

జ్యోతులను వెలిగించి బాణ సంచాలు కాల్చి ఆనందించెడు దీపావళి మరలా వచ్చినది. ఈ ఆనందము బాహ్యమైనది. పైగా అది ఆరోజుకే పరిమితము. అటు తరువాత మన దైనందిక జీవితములో పడిపోయి కొట్టుమిట్టాడుచుండెదము. ఈ ఆనందమును అంతరంగములో అనుభవించుటకు బహుకొద్దిమంది మాత్రమే ప్రయత్నించెదరు. దీనిలో సఫలీకృతులము కావలెనన్న అంతర్ముఖులమై ఆధ్యాత్మిక మార్గములో ముందునకు సాగిపోవుచు మన ప్రయత్నములో నిరంతరము దివ్య సహాయముతో కూడిన మార్గము లభించవలెను. అత్యుత్తమ ఆధ్యాత్మిక లక్ష్యసాధనకు యోగమార్గమే శరణ్యమని మహానుభావులు చెప్పినారు. ప్రస్తుత ప్రపంచములో అనేక యోగమార్గములు వాడుకలోనుండుట మన అందరికీ తెలిసిన విషయమే. ఒక్కొక్క లక్ష్యమును చేర్చుటకు ఒక్కొక్క యోగము సహకరించును. సాధారణముగా భౌతిక, శారీరక విషయములపై కేంద్రీకృతమైన యోగములకే ఎక్కువమంది ప్రజానీకము ఆసక్తి చూపెదరు. అటువంటివాటికి ఎంత సొమ్మైనను ఖర్చు చేయుటకు వెనుకంజ వేయరు. ఇటువంటి యోగములు ఐహిక విషయములకు ఉపకరించవచ్చునేమో కాని సత్‌తత్వము పొందుటకు ఉపయోగపడవు.

ప్రపంచములో ప్రస్తుతము అశాంతి కమ్ముకొని మానవులందరి మనస్సులు గందరగోళ పరిస్థితులలో వున్నవి. భౌతిక సంపదలకిచ్చు విలువ సత్‌తత్వ సంపదలకు యిచ్చుట లేదు. భౌతిక సంపదలెన్ని వున్నను తృప్తిచెందక మానసికముగా ఏదోఒక వెలితి వుండుటవలన ప్రశాంతత కరువైనది. దానిని పొందుటకు బాహ్యమైన, యింద్రియ సుఖమునొసగు పద్ధతులకే ప్రాముఖ్యతనిచ్చుచున్నారు తప్ప దీనివలన లభించు ఆనందము క్షణికమైనదని, దీనికంతయు మానసిక సమతుల్యత లోపించుటయే కారణమని గుర్తించుట లేదు. మనస్సును సమతుల్యస్థితికి తీసుకొని వచ్చినపుడు మనకు అందుబాటులో నున్న వాటితో తృప్తిని చెంది ఆనందకరమైన జీవితమును గడిపెదము. దీనికి పతంజలి రాజయోగము సరియైనది. ఇది యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన మరియు సమాధి అను ఎనిమిది అంగములతో కూడియున్నది. దీనిని ప్రాచీన భారతావనిలో అనేకమంది ఋషి, యోగి పుంగవులు అరణ్యములకు పోయి కఠోరమైన నియమ నిష్ఠలతో ఆచరించినను ఆశించిన ఫలితములను బహుకొద్దిమంది మాత్రమే పొందినారని మనకు తెలియుచున్నది. గృహస్థ జీవితము గడుపు మానవునకు ప్రస్తుత పరిస్థితులలో తన జీవితావసరములు సమకూర్చుకొనుటకు దినములో ఎక్కువ భాగము వెచ్చించవలసి యున్నది కావున ఈ యోగమార్గములో సాధన చేసి సద్గతులు పొందవలెనను సంకల్పమున్నను యిది తమవల్ల కాదని

లబ్ధిని పొందలేకున్నారు. ఇటువంటి పరిస్థితులలో శ్రీ రామచంద్రజీ మహారాజ్ వారు ప్రతిపాదించిన సత్యపథమార్గములో పతంజలి యోగమునకు తగు మార్పులు చేసి గృహస్థులందరికి ఆచరణ సాధ్యము చేసినారు. వీరి సత్యపథమార్గములో పతంజలి యోగములోని ఏడవ అంగమైన ధ్యానముతోనే మనము సాధన మొదలుపెట్టు అవకాశము కల్పించుటయేకాక, మన సాధనలో త్వరితముగా అభివృద్ధి సాధించుటకు ప్రాణాహుతి ప్రక్రియను ప్రవేశపెట్టినారు. అంతియేగాక మనకు రోజులోగల 24 గంటల కాలములో వివిధ సమయములలో మొత్తము రెండు గంటలు, అనగా రోజులో 9వ శాతము సమయము, వినియోగించి వారు చెప్పిన రీతిలో సాధన చేయుచు ప్రాణాహుతి సహాయము కూడ పొందినచో, పూర్వకాలములోని యోగులు ఎన్నియో కష్టనష్టములకోర్చి వారి జీవితమంతయు ధారపోసి సాధించిన సత్‌తత్వ ప్రగతికన్నా మిన్నగా పొందవచ్చని నిరూపించియున్నారు.

మానవ జీవితము అశాశ్వతమైనది. పుట్టిన ప్రతిజీవికి ఏదోఒకరోజున మరణమాసన్న మగునని ప్రతిఒక్కరికి తెలిసిన విషయమే. మరణమునకు వయస్సుతో నిమిత్తము లేదు. అందువలన ఆధ్యాత్మిక పథమునాచరించుటకు తగిన వయస్సు రాలేదనుకొనుట వట్టి భ్రమయే. మానవ జన్మ దైవ సాన్నిధ్యము చేరుటకే ప్రసాదించబడిన వరమనెడి వాస్తవమును గుర్తించి, దీపముండగనే ఇల్లు చక్కదిద్దుకొని, పూజ్య బాబూజీ మహారాజ్ వారు అత్యంత కరుణతో మనకు ప్రసాదించిన సత్యపథమార్గమును వారు చెప్పిన పద్ధతిననుసరించి సాధన చేయుచూ మన అంతరంగములను సమతుల్యస్థితికి తీసుకొని వచ్చి హృదయములలో దివ్యతేజస్సు నింపుకొని, సత్‌తత్వప్రాప్తిని పొందవలెను. తపన కలిగిన సాధకులకు మన ఈ చిన్ని ప్రయత్నములో గురుదేవుల అనంతమైన కృపాకటాక్షములు సదా లభించగలవని మా ప్రగాఢ విశ్వాసము.

- వి. రామం